# బాష్పాంజలి

## అవధానుల సుధాకరరావు

వెంకట్రావు, కుటుంబరావులు ఉద్యోగంలో ఒకేసారి చేరారు. పదేళ్ల సర్వీసు పూర్తి చేసినా వాళ్లింకా అలాగే ఉన్నారు - అదే మెట్టు మీద. అయితే వాళ్ల మనస్తత్వంలో మటుకు చెప్పుకోదగ్గ మార్పొకటి వచ్చింది. అదేమిటంటే - సంపాదించాలనే కాంక్ష. ఉద్యోగంలో చేరిన కొత్తలో నీతి, నిజాయితీ అంటూ భలే సిన్సియర్‌గా ఉండేవాళ్లు. దేశాన్ని ఉద్ధరించడం తమ చేతుల్లోనే ఉంది అనే ఊహతో ఎన్నెన్నో ఆదర్శాల్ని అభ్యుదయ భావాలను గుండెలో నింపుకునేవారు.

కాలక్రమంలో వాళ్ల ఆలోచనా సరళి మారింది. ఆనాటి ఉడుకు రక్తం చల్లారిందేమో, ఆదాయం కోసం అర్రులు చాచడం మొదలెట్టారు. మంచి సీటు సంపాదించుకోవడం కోసం ఇద్దరూ యధాశక్తి పైరవీలు చేసి రికమండేషన్లు కొట్టించారు. తత్ఫలితంగా కుటుంబరావుకి పదీ పరకా లభించే 'సీటు' దొరికితే, వెంకట్రావు మినిస్టర్ లెవల్లో ట్రై చేసినందుగ్గాను కనకవర్షం కురిసే ఇంజనీరింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో పడ్డాడు. రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్న ఇంజనీర్లకి సంబంధించిన అన్ని వ్యవహారాలూ అతనే చూస్తాడు. చాలా కీలకమైన 'సీటు'. అందుకే అతనికి గొప్ప డిమాండు. అతనికోసం వచ్చిపోయేవారి సంఖ్య లెక్కకందదు అందరికీ అతనితో ఏకాంతంగా మాట్లాడాలని ఉంటుంది.

వెంకట్రావు బంగారుపిచ్చుకైతే, కుటుంబరావు దొరికిన గింజల్ని ఏరుకుతినే మామూలు పిచ్చుకలాంటివాడు. అయినా వారిద్దరి స్నేహానికి మాత్రం ఎలాంటి అవరోధం లేదు.

కుటుంబరావుకి నలుగురు సంతానం. ఖర్చులు చాలా ఎక్కువ. వెంకట్రావు ఒకే ఒక్క మగబిడ్డతో, అపరిమిత ఆదాయంతో వర్ధిల్లుతున్నాడు. సుఖసంతోషాలకి ప్రాధాన్యమిచ్చే మనిషి కావడంతో నాలుగు చేతులా సంపాదించి రెండు చేతులా ఖర్చు చేస్తాడు. కుటుంబరావు కుచేలుడుగాను, వెంకట్రావు శ్రీకృష్ణుడుగాను అభివర్ణించుకుంటూ ఉంటారు పరిచయస్థులంతా. ఎప్పుడూ జంట కవుల్లా ఒకరినొకరు అంటిపెట్టుకుని తిరుగుతూంటారు.

ఎవరి కే సమస్యలొచ్చినా మరొకరికి చెప్పుకుంటారు. ఇద్దరి మధ్యా రహస్యాలకి తావే లేదు.

ఒకరికొకరు అండగా ఉంటూ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు.

** ** **

వెంకట్రావు, కుటుంబరావు లిద్దరూ ప్రస్తుతం ముప్పయ్యోపడిలో ఉన్నారు. చెప్పుకోదగ్గ మార్పేమిటంటే, ఇరవైలో గోరంత కూడా లేని దైవభక్తి వా రిద్దరిలో ఇప్పుడు అనంతంగా వ్యాపించుకుపోయింది. ముఖ్యంగా కుటుంబరావు పూజలు, ఉపవాసాలతో ఆ 'సర్వాంతర్యామి' కరుణా కటాక్ష వీక్షణం కోసం తెగ ఇదైపోతున్నాడు.

"స్వామీ! మా వాడు పెద్ద బిల్డింగే కట్టేశాడు. కనీసం నే నో మంచి ఫ్లాటైనా సంపాదించుకునే వరం అనుగ్రహించు తండ్రీ!" అని విన్నవించుకుంటాడు.

ఇంట్లో నుంచి ఆఫీసుకు బయలుదేరే ముందు మరోమారు దేవుళ్ల ఫొటోల కేసి దీనంగా చూస్తాడు.

"ఇవాళ మంచి పార్టీ తగిలి జేబులు బరువెక్కా"లనే అభీష్టం అతని మనసులో నిండి ఉంటుంది.

దసరా, దీపావళి పండుగలు దగ్గర్లోనే ఉన్నాయి.

అందరికీ కొత్త బట్టలు, స్పెషల్ వంటకాలు - బోలెడంత ఖర్చుంది. కుటుంబరావు పై సంపాదన గురించి బాగా ప్లాను వేస్తున్నాడు. నిర్మొహమాటంగా వసూలు చేయాలి. డబ్బు చేతిలో పడ్డాకనే ఫైలు రాయాలని గట్టిగా నిశ్చయించుకున్నాడు.

ఆరో జతను ఆఫీసుకు వెళ్లి రిజిస్టర్‌లో సంతకం చేసి ఓ అరగంట కాంటీన్‌లో కాలక్షేపం చేసి, దారిలో పోస్టాఫీసులో ఓ పది నిముషాలాగి పదకొండుంబావుకి సీటుకి చేరుకున్నాడు.

అప్పటికే అక్కడ అతని కోసం ఎదురుచూస్తోంది ఓ బడుగు జీవి. ఏభై దాటిన వయసు. బాగా పెరిగిన గడ్డం, బక్కచిక్కిన ఆకారం.

"ఎవరండీ మీరు?" చిరాగ్గా ప్రశ్నించాడు కుటుంబరావు.

"అనంతరావండీ నా పేరు. డైరెక్టరేట్ ఆఫీసులో పాతికేళ్లుగా యు.డి.సి. చేస్తూ మరో మూడేళ్లలో రిటైర్ కాబోతున్నవాణ్ని."

"హరికథ చెబుతా రేం? నాతో ఏమిటి పని?"

"మరో పది రోజుల్లో మా అమ్మాయి పెళ్లి ఉందండీ! కట్నం డబ్బుకి పదివేలు తక్కువైంది. ప్రావిడెంట్ ఫండ్ లోన్‌కి దరఖాస్తు పెట్టాను ..." చేతులు నలుపుకుంటూ తన గోడు చెప్పుకున్నాడు.

కుటుంబరావుకి ట్రాజెడీ అంటేనే ఎలర్జీ. 'ఇవాళ మొట్టమొదటి బోణీ ఇలాంటి ముష్టి ముదనష్టపు కేసుతో మొదలైం దేమిట్రా, దేవుడా!' అనుకున్నాడు.

అదే వెంకట్రావు ఈపాటికి ఏ 'కుబేరుడి'తోనో కులాసాగా మాట్లాడుతూ ఉంటాడు.

కుటుంబరావు ఊహ నూటికి నూరుపాళ్లు నిజం.

అదే బిల్డింగ్‌లో ఉన్న ఎనిమిదవ అంతస్తులో ఉంది ఇంజనీరింగ్ సెక్షన్.


వెంకట్రావు పేర్సకోసం అప్లికేషన్ ఫామ్స్ ఫిలప్ చేసే పనిలో ఉండగా, "నమస్తే సార్!" అన్న పలకరింపు వినిపించి తలెత్తి చూశాడు.


"ఓ! మీరా! రండి, కూర్చోండి!" సాదరంగా ఆహ్వానించాడు.

ఆ వచ్చిన వ్యక్తిపేరు శిశుపాలరావు. సూపరింటెండింగ్ ఇంజనీర్.

"మీతో కాస్త పనుండి వచ్చానండీ!" అన్నా డతను.

"పనేమిటో తెలుసు. నేడో, రేపో నా దగ్గరకు మీ రొస్తారనీ తెలుసు." వెంకట్రావు చెప్పాడు రాస్తున్న






కాగితాలను డ్రాయర్‌లో పడేస్తూ.

ఆ వచ్చిన వ్యక్తి ఆశ్చర్యపోలేదు. కారణం వెంకట్రావు చురుకుదనం గురించి తెలిసి ఉండటమే. డిపార్ట్‌మెంట్‌లో ప్రతి ఒక్కరికీ తెలుసు వెంకట్రావు నేర్పరితనం గురించి.

"మీరే నన్ను ఆదుకోవాలి!" హోదాను మరిచి అభ్యర్థించాడు ఎస్.ఇ. నిజాని కతను సంబంధిత మంత్రిగారి దగ్గర బంధువే! సదరు ఆ మంత్రిగారే ఎస్.ఇ.ని వెంకట్రావు దగ్గరకు వెళ్లి కలుసుకోమని సూచించారు.

"ఆ వెంకట్రావు ఫైలు రాశాడంటే దానికి తిరుగుండదు. సి.ఎం. కూడా ఏకీభవించాల్సిందే. మనం వుల్ల పెట్టడానికి ఛాన్సుండదు. కాబట్టి అతణ్ని నీ కనుకూలంగా చేసుకున్నావంటే నీ గండం గడిచినట్లే!" అంటూ విపులంగా చెప్పారు మంత్రిగారు.

వెంకట్రావు సావధానంగా అంత విని, చెప్పాడు - "మీ ఉద్యోగానికి ఎలాంటి ముప్పూ రాదు. మీరు నిశ్చింతగా ఉండండి!" అని.

ఆ అభయహస్తం తృప్తి కలిగించినా, మరో అనుమానం వెలిబుచ్చాడు ఎస్.ఇ. "సార్! మరి ఏ.సి.బి. వాళ్లు తక్షణమే నన్ను సస్పెండ్ చేయమని రాశారు కదా! ఎలా?" అంటూ.

"అది కేవలం వాళ్ల రికమండేషన్ మాత్రమే. తుది నిర్ణయం మాదే!"

"హమ్మయ్య! నా కిప్పుడు నిశ్చింతగా ఉంది, సార్! మీరు పని మొదలెట్టండి. నేను మళ్లీ వచ్చి కలుస్తాను మిమ్మల్ని."

"రైట్! వెళ్లిరండి!" మర్యాదగా చేయి కలిపి సాగనంపాడు. అదే వెంకట్రావు ప్రత్యేకత.

మరి కుటుంబరావో?

సాధారణంగా అతని దగ్గరకు కార్యార్థులై వచ్చేవారంత నిర్భాగ్యులే! మురికిపోడుతూ పేదరికపు వాసనా, చెమట కంపుతో ఉండే ఆ దరిద్ర నారాయణుల్ని చూస్తేనే చీదరించుకుంటాడు.

"ఇంతకీ ఏమంటావయ్యా నువ్వు?" ఆ ఆసామిని ప్రశ్నించాడు కుటుంబరావు మహా చులకనగా.

"నిన్న సాయంత్రం నా అప్లికేషన్‌ని మీ టపాల్ సెక్షన్‌లో అందజేయటం జరిగిందండీ! దయచేసి మీరు దాన్ని పరిశీలిస్తే ..."

"ఇంకా నాదాకా రాలే దది. రేపు ఉదయం నా కందుతుంది. వీలునిబట్టి పరిశీలిస్తాను." వుల్ల విరుపుగా అన్నాడు కుటుంబం.

అనంతరావు ముఖంలో గూడు కట్టుకున్న విచారం ఎంతటివాళ్లనైనా కదిలించి తీరుతుంది. కాని కుటుంబరావు ఇలాంటివాటన్నిటికీ అతీతుడు. ఎంతసేపూ రాబట్టుకోవడం గురించి, తన కేమాత్రం గిట్టుబాటవుతుందని మాత్రమే ఆలోచిస్తూ ఉంటాడు.

"మీరే అలా అంటే ఎలా సార్? నేనూ మీలాంటి ఉద్యోగస్తుణ్నే కదా! కాస్త కనికరం చూపండి!" అంటూ వేడుకున్నాడు.

"కుదరదు. నా దగ్గర యాక్షన్ తీసుకోవలసిన కాగితాలు డెబ్భైతొమ్మి దున్నాయి. మీ సీరియల్ నంబరు ఎనభై. ఆ వరుస క్రమం తప్పవలసిన అవసరం నాకేమిటి? మీ పట్ల స్పెషల్ ఇంట్రెస్ట్ చూపితే నా కొరిగేదేమిటి?"

"పుణ్యముంటుంది, సార్! ఎన్నో బరువు బాధ్యతలతో నలిగిపోతున్నవాణ్ని."

కుటుంబరావు విసుగ్గా చూస్తూ, "నీ ఫైల్ పుటప్ చేయాలంటే నువ్వు నా చెయ్యి తడపక తప్పదు. ఎంతిచ్చుకోగలవో చెప్పు!" నిర్మొహమాటంగా బేరంలోకి దిగాడు.

"నా దగ్గ రేముంది సార్! అప్పుల సముద్రంలో మునిగి, ఆర్థిక బాధల ఆటుపోట్లతో నలిగిపోతున్నవాణ్ని! రక్తమాంసాలు లేని ఈ శరీరం రాబందులక్కూడా పనికిరాదు, సార్, ప్రాణం పోయాక! కృతజ్ఞతలు చెప్పుకోవడం తప్ప మీకు నే నేమీ ఇచ్చుకోలేను."

"సాయంత్రానికల్లా ను వ్వడిగిన పదివేలు శాంక్షన్ చేస్తూ ఆర్డరు కాగితం అందిస్తాను. ఓ వంద ఇచ్చుకోగలవా!" ఆఖరి మాటగా అడిగాడు కుటుంబరావు.

"వీలు పడదు, సార్! ఆ పదివేలల్లోంచి ఒక్క పది పైసలు కూడా తగ్గడానికి వీల్లేదు!" నిస్సహాయంగా అన్నాడు అనంతరావు. ఆ డబ్బుని యథాతథంగా పట్టుకెళ్లి వరుడి తండ్రికి సమర్పించుకోవాలి తను.

కుటుంబరావుకి తగని కోపమొచ్చింది. "నా టైము వేస్ట్ చేయకుండా ఇక్కణ్నుంచి వెళ్లిపో! నువ్వు చెప్పుకోవలసి దేమన్నా ఉంటే మా ఆఫీసరు దక్షిణామూర్తి గారి దగ్గర కెళ్లు!"

ఆ సెక్షన్‌లో ఉన్న మిగతా ఉద్యోగులు 'ఇలాంటి వ్యవహారం మాకు మామూలే' అన్నట్లు ఎవరి పనిలో వారున్నారు.

అనంతరావు భారంగా అక్కడ్నుంచి కదిలాడు.

కుటుంబరావుకి మూడ్ చెడిపోయింది. చక్కటి కాఫీ తాగితే గానీ బుర్ర పనిచేయదు.

లిఫ్ట్‌లో మిత్రుడి దగ్గర కెళ్లాడు.

వెంకట్రావు పనిచేసే సెక్షన్ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ కావడంతో ప్రత్యేకించి ఓ గది కేటాయించారు వాళ్లకి. అతనిపై ఓ సెక్షన్ ఆఫీసరు ఉంటాడు. కాని, ఆ అధికారి ఓ వెర్రి వెంగళప్ప కావడంతో వెంకట్రావు కెదురు లేకపోయింది. ఫైలు రాసేటప్పుడు అతని బుర్ర పాదరసంలా పనిచేస్తుంది. అతను పెట్టమన్న చోట సంతకం పెడతాడు సెక్షనాఫీసరు. అందుకే అతనికి ఆఫీసు పనంటే చెడుగుడు ఆడుకున్నంత ఉత్సాహం కలుగుతుంది.

టైపింగ్, డిస్పాచ్ వగైరా పనులన్నీ అతనే చూసుకోవలసి ఉంటుంది. అందుగ్గానూ అతనికి ప్రత్యేక అలవెన్స్ ఉంటుంది. ఎంత పని చేసినా ఎప్పుడూ అలసినట్లు కనిపించకపోవడం కుటుంబరావుకి ఆశ్చర్యంగా ఉంటుంది.

"ఏం, మిత్రమా! ఏదో గట్టి కేసే తగిలినట్లుంది?" కించిత్ అసూయ కూడా ఉంది కుటుంబరావు అడిగిన తీరులో.

"అవును, నీలాంటివాడికైతే అరిగించుకోవడం కూడా కష్టమే!" చెప్పాడు వెంకట్.

"ఏమాత్రం దొరుకుతుం దేమిటి?" ప్రశ్నలో దాగున్న దుర్గని పసిగట్టాడు వెంకట్రావు.

"సీక్రెట్స్ అన్నీ చెప్పకూడదు భాయ్ ప్రస్తుతానికి కమ్మటి కాఫీ తాగి వెళ్లు. అనక 'ఎవరెస్ట్'కి వెళ్దాంలే!" అంటూ తన ఫ్లాస్క్‌లో కాఫీని రెండు కప్పుల్లో పోశాడు.

కుటుంబరావు పది నిముషాలు కూర్చుని

## బాలీవుడ్ బాణీ

### సునీల సంచలనం

మోడల్ అవతారం చాలించి సినిమా నటిగా మారిన సునీలా కాంబ్లేకర్‌ను ప్రస్తుతం బాలీవుడ్ సంచలనంగా చెప్పుకుంటున్నారు. 'చరాగ్ దిన్'లో నటించి పలువురి దృష్టిలో పడిన సునీల శక్తిసామంత నిర్మిస్తున్న 'అహంకార్'లో కొత్త తరహా పాత్రలో కనిపిస్తుంది. ఇలా అరుణ్ గానంలో 'చిక్నాహై సానా' అనే పాటను సుభాష్ ఘై సూపర్‌గా తీశాడని చెప్పుకుంటున్నారు. ఈ చిత్రం తర్వాత సునీల సూపర్‌హిట్ కావడం ఖాయమట... అదీ చూద్దాం.

మసూద్ అన్సారి

వెళ్లాడు.

వెంకట్రావు ఎంతో ఏకాగ్రతతో అరడజను సిగరెట్లను ఊదిపారేసి శిశుపాలరావు ఫైల్ పూర్తిచేశాడు. అరనిముషం వ్యవధిలో అది ఆ రూములో నుంచి బయట పడి అసిస్టెంట్ సెక్రటరీ ట్రేలోనికి వెళ్లింది.

ఆయనగారు తన టేబుల్ మీద ఎప్పట్నుంచో పేరుకు పోయి ఉన్న రెండొందల ఫైళ్లని అలాగే వదిలేసి, అప్పుడే వచ్చిన ఆ ఫైలు మీద గ్రీనింక్‌తో సంతకం చేసి విముక్తి కల్పించేశారు.

ఫైలు తనకి రావడానికి ముందే భారీ మొత్తంలో ముడుపు ముట్టింది కాబట్టి ఇలా రాగానే అలా సంతకం పెట్టి ఇంకా అలాంటి గిరాకీ లేమైనా తగుల్తాయేమో నని ఎదురు చూస్తూ కూర్చున్న సమయంలో అనంతరావు నేరుగా లోపలికొచ్చేశాడు.

"నమస్తే సార్!" అంటూ ప్రారంభించి, విషయం చెప్పి, "మీరే ఎలాగైనా ఆదుకోవాలి" అంటూ బతిమాలుకున్నాడు.

దక్షిణామూర్తి నిజంగా సార్థక నామధేయుడు. అతనికి తన టేబుల్ మీద ఎత్తుగా పెరిగిపోయిన ఫైళ్లని చూస్తూంటే అవి కరెన్సీ కట్టల్లాగా కనిపిస్తూంటాయి. మరో ఆరు నెలల్లో రిటైర్ కాబోతున్నాడేమో - విపరీతమైన ధనాశతో 'దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అనే సూత్రన్ని ఖచ్చితంగా పాటిస్తున్నాడు. అష్టదరిద్రుడులా ఉన్న అనంతరావుని చూసి చిరాకుపడ్డాడు.

"చూడు, బాబూ! ప్రావిడెంట్ ఫండ్ అనేది సేవింగ్స్ బాంక్ అకౌంట్ కాదు ఇష్టానుసారం వాడుకోడానికి. నీకు లోన్ శాంక్షన్ చేయడానికి రూల్స్ ఒప్పుకోవు" అంటూ కపట నీతులు చెప్పి పంపించేశాడు.

అనంతరావు కడుపు ఖాళీగా ఉంది. ఒంట్లో నీరసంగా ఉంది. కళ్లు తిరుగుతున్నట్లుగా అనిపించి బయట బల్ల మీద కూర్చున్నాడు.

ఇంజనీరు శిశుపాలరావు ఫైలు అప్పుడే అంచెలంచెలు దాటి సెక్రటరీ గారి ఆమోదం పొంది, సంబంధిత మంత్రిగారి దగ్గరకు వెళ్లింది.

అప్పుడు శివపాలరావు ఆయన దగ్గరే కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుతున్నాడు.

పి.ఎ. తెచ్చిన ఫైలు మీద 'అప్రూవ్డ్' అని రాసి, సంతకం చేసి పంపాక, "చూడవయ్యా! నీ కళ్లముందే నీ ఫైలు నువ్వు కోరుకున్న రీతిలో డిస్పోజ్ చేశాను. ఇక నీ వంతు కర్తవ్యం మిగిలి ఉంది" అన్నాడు నర్మగర్భంగా.

శిశుపాలరావు మహదానంద భరితుడై - "అవశ్యం, సార్! పారవశ్యంలో మీరు ప్రపంచాన్ని మరచి ఉక్కిరిబిక్కిరయ్యేలా నేను చూసుకుంటాను. మీ శక్తి సామర్థ్యాలన్నింటినీ కూడగట్టుకుని పసందైన విందు ననుభవించటానికి సిద్ధంగా ఉండండి!" అని చెప్పి వెళ్లిపోయాడు.

** ** **

అనంతరావులో ఇంకా ఆశ చావలేదు. ఆఖరి ప్రయత్నంగా మరో ఆఫీసర్‌ని కలుసుకోడానికి వెళ్లాడు.

ఆ సమయానికి ఆయన వంద రూపాయల నోట్లు లెక్కపెట్టుకుంటున్నాడు. శిశుపాలరావు ఫైలు మీద సంతకం పెట్టినందుకు అతనికి



### శిక్షిస్తానులే !

జడ్జిగారి భార్యను కిడ్నాప్ చేశారు దొంగలు. ఆయనకు నమ్మకం కుదరడానికి ఆమెను ఫోన్‌లో మాట్లాడ మన్నారు.

"ఏమండీ... వీళ్లు నన్ను చంపేస్తారేమోనని భయంగా ఉంది!" కంగారుగా ఏడుస్తూ అంది ఆవిడ.

"నీకేం భయంలేదు. నిన్ను చంపితే తప్పకుండా వాళ్లకు ఉరిశిక్ష వేసే బాధ్యత నాది!" ఓదార్చాడు భర్త.

ఎం. అనిత (చిత్తూరు)

---

లభించిన పారితోషికం అది. అంచనాకు మించిన మొత్తం దొరికిన ఆనందం అతని ముఖంలో ప్రతిఫలిస్తోంది.

అనంతరావు తన అవసరం గురించి దీనంగా, దయనీయంగా చెప్పుకున్నాడు.

ఆఫీసర్ అంతా విని, "న న్నేం చేయమంటావు?" అనడిగాడు.

"ఎవరి దగ్గర కెళ్లి మొరపెట్టుకున్నా ముందు నా కెంతిస్తా వని నిలదీస్తున్నారు, సార్!" చెప్పాడు అనంతరావు.

"ఇవ్వాళ రేపు ఇలాంటివి సర్వసాధారణమయ్యా! పని జరగాలంటే కాస్త ఖర్చుపెట్టాలి, తప్పదు!" స్టాఫ్‌నే సమర్థించాడు.

"పేదవాణ్ని సార్! చాలా కష్టాల్లో ఉన్నాను."

"ఎవరి సమస్యలు వారి కుంటాయి! నువ్వు మూడేళ్లలో రిటైర్ కాబోతుంటే నా గడువు మూడు రోజులే ఉందయ్యా! నీకు పెళ్లి కావలసిన పిల్ల ఒక్కతే! కాని నాకు అరడజను మంది ఉన్నారు. నే నెవరికి చెప్పుకోను? నీకు నేను సాయం చేస్తాను, ఓ మాటై ఇచ్చుకో, చాలు!"

అనంతరావు చేతులు జోడించి నమస్కారం పెట్టి బయట కొచ్చాడు.

ఆఫీసర్ 'పూర్ ఫెలో!' అంటూ జాలిపడ్డాడు. అంతలోనే ఏదో ఆలోచన తట్టింది. గదిలోనుంచి వెళ్లేటప్పుడు అనంతరావు చూపులకు అర్థం వెదుకుతున్నాడు ఆఫీసరు.

తన టేబుల్ మీద ఖాళీ కూల్ డ్రింక్ సీసాలున్నాయి. ఇందాక ఇంజనీరు శిశుపాలరావు ఫైలు గురించి తన దగ్గరకు వచ్చినప్పుడు వదలి వెళ్లిన ఆ సీసా మీద ఈగలు వాలి దానినే మహాప్రసాదంగా చప్పరిస్తున్నాయి. అనంతరావు చూపులు అక్కడ్నుంచి తన ముఖం మీదకు కూడా మళ్లాయి. అంటే దాని భావం ...? 'పెదవి విప్పకుండానే ఎంత ఛండాలపు మాటన్నావురా, నీ యమ్మకడుపు కాలా!' ఉక్రోషంగా తిట్టుకున్నాడు.

బయట కొచ్చిన అనంతరావు తూలి పడబోయి, ఎలాగో నిగ్రహించుకున్నాడు. రాత్రి తిన్న అన్నమే. ఉదయం ఓ అరగ్లాసు కషాయం లాంటి కాఫీని గొంతులో పోసుకుని బయలుదేరాడు. ఇంట్లో సరకులన్నీ నిండుకున్నాయి.

"బాబూ! కాసిని మంచినీళ్లిస్తావా?" ఆకలి మంటని చల్లార్చుదామని చప్రాసీ నడిగాడు.


"ఓ అయిదు నోటుందా?"

"ఏమిటీ?! ఆఖరికి ప్రభుత్వ కార్యాలయాల్లో తాగే నీటికి కూడా రేటా?" ఆశ్చర్యంగా అడిగాడు.

అనంతరావు ఎక్కడికెళ్లినా, ఎవరిని పలకరించినా ఒక్కటే మాట - లంచం! పనుల మీద వచ్చే జనం దగ్గర శక్తివంచన లేకుండా వసూలు చేసుకోవడమే ధ్యేయం! బతుకులోని దరిద్రమంత ఒక్కసారే తీరిపోవాలనుకుంటున్నారా వీళ్లు!

చెట్టు మొలవాలంటే వాన పడాలి. అది ప్రకృతి సహజం! ఆఫీసుల్లో ఫైళ్లు కదలాలంటే డబ్బు ఖర్చుపెట్టాలి. ఇది ఉద్యోగుల నైజం!

అనంతరావు సొమ్మసిల్లినట్లుగా పడుకుండిపోయాడు లాన్‌లో. లేవా లనిపించడంలే దతనికి. పాడు ప్రాణం, ఇలాగే పోతే ...? ఆ వచ్చే డబ్బుతోనన్నా కూతురి పెళ్లి సజావుగా జరిగిపోతుందేమో!





బలహీనత వల్ల కాబోలు కాళ్ళు, చేతులు విపరీతంగా గుంజుతున్నాయి. భరించలేని ఒళ్ళునొప్పి.

అతనలా రెక్కలు విరిగిన పక్షిలా ఉంటే, అతనితోపాటే ఆ ఆఫీసులోకి అడుగుపెట్టిన శిశుపాలరావు కార్యసాధకుడై, విజయగర్వంతో, దర్పంతో కారులో ఇంటికెళ్ళిపోయాడు.

రావడానికి ఇద్దరూ ప్రభుత్వోద్యోగులే. ఇద్దరి ముఖ్య హోదాల తేడా ఉన్నా, చెరొక పని మీద వచ్చారు.

అనంతరావు పాపం, తన డబ్బులోనుంచే ఓ పదివేలు అప్పుగా పొందలేని నిర్భాగ్యుడు.

శిశుపాలరావు పాతిక లక్షల ప్రభుత్వ ధనాన్ని ఉగమింగి, ఎలాంటి శిక్షకీ గురికాకపోవడమే కాక, మరో యాభై లక్షలకి కొత్త స్కీమ్‌ని మంజూరు చేయించుకుని రొమ్ము విరుచుకుంటూ వెళ్ళిపోయాడు.

అనంతరావు పెట్టుకున్న దరఖాస్తు టపాల్ సెక్షన్ నుండి క్లర్క్ దగ్గరకు రావడానికి మూడు రోజుల వ్యవధి పడుతుంది. అదే ఓ అవినీతి చక్రవర్తి కేవలం మూడు గంటల్లో తన కనుకూలమైన ఆర్డర్ని ఎలా పొందగలిగాడు?

ధనం, రాజకీయ పలుకుబడి!

ఈ రెండు దివ్యాస్త్రాల వల్ల అతని ఫైలు చకచకా ఎక్కడా ఎదురులేకుండా మెట్లెక్కుతూ పైకి వెళ్ళింది. నలుగురు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఇద్దరు మినిస్టర్లు, చీఫ్ సెక్రటరీ, సి.ఎం. ప్రతిచోటా అతని ఫైలు యుద్ధ ప్రాతిపదిక మీద చూడబడింది, ఆమోదించబడింది.

కనీసం మూణ్నెళ్ళు పట్టవలసిన ఫైలుకి, కేవలం మూడు గంటల్లోనే మోక్షం లభించడం విచిత్రం అనుకుంటే పొరపాటే! దాన్ని ఆశ్రిత పక్షపాతం అన్నా తప్పులేదు.

శిశుపాలరావుకి ప్రభుత్వ యంత్రాంగంలో ఎలా పనులు చేయించుకోవాలో బాగా తెలును. అందుకే అతనికి ఎక్కడికెళ్ళినా స్వాగత సత్కారాలు లభిస్తాయి.

** ** **

ఎంత భయంకరమైన జాగిలమైనా బిస్కెట్లు విసురుతుంటే తోక ఊపుతూ, విధేయత ప్రదర్శిస్తుందని శిశుపాలరావు గట్టిగా నమ్ముతాడు.

** ** **

సమయం రాత్రి ఎనిమిది గంటలు. చలికాలం కావడం వల్ల రోడ్ల మీద జనసంచారం బాగా తక్కువగా ఉంది.

తెల్లటి దీపకాంతులతో బిర్లామందిర్ దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

ప్రశాంతమైన ఆ పరిసరాల్ని వదిలి రావడానికి మనసొప్పడం లేదా అమ్మాయికి.

మరోసారి 'శ్రీనివాసుడి'కి మనసులో కోరికని వెల్లడించుకుంది.

త్వరలో తన మెళ్ళో మూడు ముళ్ళూ పడితే తల్లిదండ్రుల సమస్య తీరుతుంది. వాళ్ళ దిగులు తన చూడలేకపోతోంది.

ఆమె గృహోన్ముఖురాలైంది.

పద్దెనిమిదేళ్ల వయసులో పసిడి బొమ్మలా ఉందామె. అందరి దృష్టీ ఆమెపైనే.

రిక్షాలవాళ్లు నిర్లజ్జగా, ఆటో డ్రైవర్లు ఆకలిగా, ఇతర మగవాళ్లు మక్కువగా ఆమెనే చూస్తున్నారు. ఆమె అదేమీ పట్టించుకోవడంలేదు.

తన పెళ్లయిపోతే తల్లిదండ్రులకి నిశ్చింత. ఒక్కగా నొక్క కూతు రని పైకి తన నేమీ అనడంలేదు కానీ, గుండెల మీద కుంపటిలా ఎదిగిన తనను ఓ అయ్యచేతిలో పెట్టలేని తమ అశక్తతని తన దురదృష్టంతో ముడిపెట్టి ఎంత నిందించుకుంటున్నారో! తన మూలంగా వాళ్లకి తిండి, నిద్ర లేవు.

చెవులు పగిలేలా కారు హారన్ మోగడంతో ఆమె ఉలిక్కిపడి పక్కకు చేరింది.

"ఏమ్మా, చావాలని ఉందా?" అడిగాడు కారతను - కిటికీలో నుంచి తల బయటపెట్టి.

"అవునండీ, ఎంచక్కా ఛస్తే ఏ సమస్యలూ ఉండవు కదా!" అం దా అమ్మాయి బదులుగా.

"ముందు నువ్వు కారెక్కు, చెప్తాను!" ఎంతో చనువుగా ఆజ్ఞాపించాడు.

ఆమె సంకోచించలేదు. కారు మెల్లిగా నడుపుతూ, "ఇంకా ముక్కుపచ్చలారనే లేదు. అప్పుడే చావుని ఆహ్వానించవలసినంత అగత్య మేమొచ్చిం దమ్మా!" అ నడిగా డా పెద్దమనిషి.

"ఈ బతుక్కెలాంటి ప్రయోజనం లేనప్పుడు, నిష్క్రమిస్తే తప్పేమిటి అంకుల్! ఎదురు ప్రశ్నించింది.

ఆయన బుర్రలో ఓ స్వార్థపు టాలోచన!

"ఎవరమ్మా చెప్పింది? నీ వల్ల జరగాల్సిన మహత్కార్య మొకటుంది!" అంటూ కారు వేగం పెంచి దారి మార్చాడు గేరుతోపాటు.

ఇంతకీ ఆ కారు ఓనరు ఎవరో కాదు - శిశుపాలరావు. మ రా అమ్మాయి? పూర్ అనంతరావు పుత్రికా రత్నం - సీత.

ఆ కారు గెస్టుహౌస్ దిక్కుగా పరుగెత్తుతోంది.

** ** **

రెండురోజులైంది. సీత జాడ తెలియక అనంతరావు తల్లడిల్లిపోతున్నాడు. అసలే అనారోగ్యపు మని షతను. ఈ షాక్‌తో బాగా క్రుంగిపోయాడు. ఎక్కడికి పోయావమ్మా? ఏమైపోయావు? ఈ అసమర్థపు తండ్రి మీద కోపమొచ్చిందా?

మూడో రోజు ఉదయం పోస్టులో అందిన ఉత్తరాన్ని ఆత్రంగా చదువుకున్నాడు.

"నాన్నా! ఈ ఉత్తరం నీ చేతికందేసరికి నేను పరలోకంలో ఉంటాను. రైలు పట్టాల మధ్య నా బతుకుని కడతేర్చుకుంటున్నాను.

"నేను గుడి నుంచి ఇంటికి తిరిగొస్తుంటే శిశుపాలరావు అనే ఇంజనీరు నన్ను తన కారులో ఎక్కించుకున్నాడు. తను సస్పెండ్ కాకుండా ఆపినందుకు, ఇంకా ఏదో ప్రయోజనం కల్పించినందుకు గెస్టుహౌస్‌లో ప్రముఖులకి ఏర్పాటు చేసిన పార్టీలో నన్ను ఓ 'ఐటమ్'గా వినియోగించాడు.

"ఇద్దరు మంత్రులు, ఇద్దరు ఉన్నతాధికారులు నన్ను నిలువునా దోచుకున్నారు. అన్నీ సవ్యంగా ఉంటేనే నాకు పెళ్లి కావడంలేదు. ఇంత జరిగాక ...? అందుకే శాశ్వతంగా ఈ లోకం నుంచి తప్పుకుంటున్నాను.

"అమ్మకి, నీకు నా తుది నమస్కారాలు.

"అన్నయ్యలకు త్వరలో మంచి ఉద్యోగాలు దొరికి మీ కష్టాలు తీరాలని కోరుకుంటూ -

"అభాగ్య సీత."

అనంతరావు కళ్లు కన్నీటి చెరువు లయ్యాయి.

** ** **

ఉదయం పన్నెండు గంటలు కావస్తోంది. శీతకాలపు లేత ఎండ పేదవాడి కన్నీళ్లలా నులివెచ్చగా ఉంది.

సచివాలయం ఔట్ గేట్ దగ్గర అనంతరావు నిలబడి ఉన్నాడు - లోపలికి ప్రవేశించడానికి అనుమతి దొరకక.

పొట్టలు పెరిగిన పోలీసు అధికారులు, తుపాకులు చేతబట్టుకుని నిల్చున్న కానిస్టేబుల్స్, సెక్యూరిటీ గార్డులు - విలువైన మంత్రుల ప్రాణాల్ని కాపాడేందుకు అప్రమత్తులై విధి నిర్వహణలో మునిగి ఉన్నారు.

కాఫీ హౌస్‌లో చెరొక కప్పు కాఫీ తాగి, చెట్ల కింద చేరారు మిత్రద్వయం - కుటుంబరావు, వెంకట్రావులు. ఇద్దరి ముఖాలు ఉబ్బి ఉన్నాయి. రాత్రి తాగిన మందు ప్రభావం వల్ల సిగరెట్‌ని ఊదిపారేస్తూ, రాత్రి కేబరే డాన్స్ తాలూకు రసవత్తరమైన సంగతుల్ని చర్చించుకుంటున్నారు.

బయట నుంచి కుటుంబరావుని చూశాడు అనంతరావు. అంతే! పోలీసులను కన్నుగప్పి రివ్వున పరిగెత్తుకు వచ్చి కుటుంబరావు కాళ్లు పట్టేసుకున్నాడు.

ఆ ఊహించని సంఘటనకి అతను తబ్బిబ్బు పడ్డాడు. పోలీసులు అతన్ని వెనక్కు లాక్కుపోవడానికి పరుగెత్తుకొచ్చారు.

"ఏయ్! ఎవరయ్యా నువ్వు? కాళ్లొదులు!" కుటుంబరావు చిరాకు పడ్డాడు.

కదిలొచ్చిన శవంలా కాస్త భయంకరంగానే ఉంది అనంతరావు వాలకం.

"నేను సార్! అనంతరావ్‌ని! మీరు పి.ఎఫ్. లోన్ శాంక్షన్ చేయలేదు కదా! మా అమ్మాయి పెళ్లాగిపోయింది. ఇప్పుడు ఈ లోకంలోనే లేదు సార్, మా అమ్మాయి! చచ్చిపోయింది! ..." ఆ మాట చెబుతుంటే అనంతరావు దుఃఖం ఆగలేదు.

"సార్! మదమెక్కిన ముండాకొడుకులు, కామాంధులు నా కూతుర్ని పొట్టన పెట్టుకున్నారు, సార్!

"ఎలక్షన్లో రిగ్గింగు చేసి నెగ్గిన సిగ్గు లేని బేవకూఫ్‌లు - మంత్రులైతే నాకేంటి సార్! అగ్నిపునీత లాంటి నా బంగారు తల్లిని పాడుచేశారు!" అతని భాష చూసి, భయం వేసి లాక్కెళ్లడానికి వచ్చిన పోలీసుల్లో ఒకడు అనంతరావు మీద చేయి వేసుకున్నాడు.

"ఎవడో ఇంజనీరు శిశుపాలరావట సార్! నా కూతుర్ని నాకు కాకుండా చేసిన నీచుడు!" ఆ మాటకి కుటుంబరావుతోపాటు అతని పక్కనున్న వెంకట్రావు కూడా ఉలిక్కిపడ్డాడు.

పోలీసులు అనంతరావుని బయటకు లాక్కుపోడానికి ప్రయత్నిస్తుంటే అతను పెనుగులాడుతున్నాడు.

"సార్! పి.ఎఫ్. లోన్ నా కిప్పుడైనా శాంక్షన్ చేయండి, సార్! నా కూతుర్ని పల్లకీ ఎక్కించడానికి కాకపోయినా, పాడె నెక్కించడానికైనా అవసరమవుతుంది.

"పట్టు చీరల్లో చూసుకుని మురిసిపోవలసిన ఈ తండ్రి ఆ డబ్బుతో దాన్ని పిడికెడు మట్టిగా మారుస్తాడు సార్!" అతని గొంతు దూరమవుతున్నా అతని ఆక్రోశం ఆ మిత్రు లిద్దరి గుండెల్లో గట్టిగా మార్మోగుతోంది.

కుటుంబరావు లోన్ శాంక్షన్ చేసి ఉంటే పాపం ఆ అమ్మాయికి ఈ దుస్థితి వచ్చేది కాదు.

పోనీ, వెంకట్రావు ఇంజనీరు పని చేసిపెట్టకపోయి ఉంటే అతను సీతని గెస్టుహౌస్‌కి తీసుకెళ్లి మంత్రులకి సమర్పించేవాడు కాదు. రెండు విధాలా చెడింది పేదవాడైన అనంతరావు.

ఈ దారుణానికి వాళ్లిద్దరి మనసులూ స్పందించాయి. అంతరంగపు పొరల్లో ఎక్కడో మారుమూల నిదురిస్తున్న పదేళ్లనాటి ఆదర్శాలు నీరసంగా, పరిహాసంగా నవ్వాయి.

ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఓ అఘాయిత్యానికి తాము బాధ్యులమని, ఓ అమాయకపు ఆడపిల్ల జీవితాన్ని బలి తీసుకున్నామనే భావనతో వాళ్ల హృదయాలు బరువెక్కాయి. పశ్చాత్తాపం దహించి వేస్తుంటే అగ్నికణం లాంటి ఓ కన్నీటి చుక్కతో ఆమెకి బాష్పాంజలి వదిలారు వారిద్దరూ.

★

